కాళోజీ జంక్షన్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలి

- వైద్య విద్య ప్రవేశ పరీక్షను రాష్ట్రాలకు అప్పగించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- కాళోజీ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కమలాపూర్ : ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

హనుమకొండ, జూన్ 20 : నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేసి పేపర్ లీకేజీ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం కాళోజీ జంక్షన్‌లో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 5న దేశవ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్షను సుమారు 24 లక్షల మంది విద్యార్థులు రాశారని, జూన్ 4న విడుదలైన నీట్ ఫలితాల్లో ఎన్నడూ లేని విధంగా 67 మందికి 720/720 మార్కులు వచ్చాయన్నారు. టాప్ స్కోర్ వచ్చిన 67 మందిలో ఆరుగురు హర్యానాలోని ఒకే కేంద్రంలో పరీక్ష రాయడంతో పలు అనుమానాలు తలెత్తాయన్నారు. నీట్ పరీక్షకు ఒక రోజు ముందే మే 4న పక్కా ప్లాన్ ప్రకారం పేపర్ లీక్ చేశారన్నారు. ఇందుకోసం బీహార్‌కు చెందిన ముఠా 35మంది విద్యార్థుల నుంచి రూ. 30 లక్షల చొప్పున భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు తేలిందని తెలిపారు. విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చెలగాటం ఆడాయని ఆరోపించారు. కేంద్రం అసమర్థత, అధికారుల అలసత్వంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. దీనిపై ప్రధాన మంత్రి మోదీ నోరు మెదపడం లేదని, ఇప్పటికైనా ఈ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పరీక్ష లీకేజీకి బాధ్యత వహించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైద్య విద్య ప్రవేశ పరీక్షను రాష్ట్రాలకు అప్పగించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి..

నీట్ పరీక్ష లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష లీకేజీపై నిరసన తెలిపారు. అంతకు ముందు సుందరయ్య భవన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆటలాడుతున్నదని ఆరోపించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ఎందుకు పేపర్ లీకేజీలు అవుతున్నాయని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసి మాయల ఫకీరు మాటలు చెబుతూ పూట గడపాలని చూస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వాంకుడోతు వీరన్న, గొడుగు వెంకట్, రాములు, తిరుపతి, ఓరుగంటి సాంబయ్య పాల్గొన్నారు.

జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి..

కమలాపూర్ : నీట్ పేపర్ లీకేజీపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి నకిర్త ఓదెలు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కమలాపూర్‌లో వారి ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోలె మహేందర్, జయప్రద, లచ్చయ్య, బొజ్జం లక్ష్మి పాల్గొన్నారు.

ప్రశ్న పత్రాలు లీకేజీ చేసిన వారిని శిక్షించాలి

ధర్మసాగర్ : నీట్ ప్రశ్నపత్రాలను లీకేజీ చేసిన వారిని శిక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల కార్యదర్శి కొట్టె వెంకటేశం, నాయకులు శంకర్ నాయక్, రాజమణి, మల్లయ్య, బాబు, అంకుస్, రాజయ్య, ప్రతాప్, సునీల్, గట్టయ్య, బాషా పాల్గొన్నారు.

పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణిస్తారు

- డీఎంహెచ్‌వో సాంబశివరావు
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు

వరంగల్, జూన్ 20 : పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుల్లో రాణిస్తారని డీఎంహెచ్‌వో సాంబశివరావు అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం హనుమకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్య, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారి మధురిమ, విద్యా శాఖ గర్ల్ చైల్డ్ అధికారి రాధాదేవి, ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఇమ్యునైజేషన్ అధికారి ఇఫ్తికర్ అలీ, అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్‌మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో యాకూబ్ పాషా, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలోని 1వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. 18యేళ్ల లోపు వారు తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ మడికొండ భాగ్య, ఆశ కార్యకర్తలు కవిత, సుధ పాల్గొన్నారు.

భీమదేవరపల్లి : విద్యార్థుల్లో నులిపురుగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ జక్కుల అనిత అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వంగ రవి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో వీరేశం, వైద్యాధికారులు రహమాన్, రుబీనా, సిబ్బంది కేఎల్ఎన్ స్వామి, స్వరూప, శ్యామల, ఉపాధ్యాయులు శ్రీకాంత్, ప్రదీప్, సుధారాణి, స్టాలిన్, ఎల్లయ్య, రామకృష్ణారెడ్డి, మోహన్, సమ్మిరెడ్డి, ఉమ, దుర్గయ్య పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీవో కల్పన మాట్లాడుతూ.. పిల్లల్లో నులి పురుగులు ఉంటే ఎదుగుదల సరిగా ఉండదన్నారు. ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ మంజూల, సూపర్‌వైజర్ శ్రీకాంత్, హెచ్ఎం లకావత్ రాజేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

కమలాపూర్ : స్థానిక టాకీస్ ఏరియా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. హెచ్ఎం పవన్‌కుమార్ పాల్గొన్నారు.

భూముల ధరల పెంపుపై కసరత్తు

- సబ్ రిజిస్ట్రార్లకు డీఆర్ దిశా నిర్దేశం
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ

హనుమకొండ, జూన్ 20 : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, వ్యసాయేతర భూముల ధరలు పెంచాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అధికారులు కసరత్తు ప్రారంభించారు. అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు పెంపుపై జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి సబ్ రిజిస్ట్రార్లతో సమాశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న ధరలు ఎంత? ఎంత పెంచాలనే అంశాలపై సబ్ రిజిస్ట్రార్లకు దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. 50శాతం మేరకు ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. భూముల ధరల పెంపు ప్రక్రియను పూర్తి చేసి ఆగస్టు నెల నుంచి కొత్త ధరలు అమలు చేసేందుకు రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల, జూన్ 20 : దవాఖానకు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సివిల్ హాస్పిటల్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్లు నిత్యం అందుబాటులో ఉండేలా, రోగులకు అవసరమైన మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత-రామకృష్ణ పాల్గొన్నారు.

'ఉపాధి పనుల వివరాలు నమోదు చేయాలి'

మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్

కమలాపూర్, జూన్ 20 : గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనుల వివరాలను రిజిష్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ కుమార్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. నాలుగేళ్లలో జరిగిన ఉపాధిహామీ పనులను ఏడు రిజిష్టర్లలో నమోదు చేయాలన్నారు. మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ తనిఖీ చేసే అవకాశం ఉందన్నారు. ప్రతి గ్రామానికి కేటాయించిన మొక్కలను ఈ నెలఖారులోగా నాటాలన్నారు. శుక్రవారం ప్రతి గ్రామంలో యోగా డే నిర్వహించి ఫొటోలను గ్రూపులో పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుండె బాబు, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో రమేశ్, ఈసీ శ్రీధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ

కార్యకర్తలను కాపాడుకుంటా

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

శాయంపేట జూన్ 20 : పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. కొత్తగట్టు సింగారంలో అరూరి ఎల్ల స్వామి, పెద్దకోడెపాక గ్రామంలో అనంతుల సుధాకర్ గౌడ్ కుటుంబాలను పరామర్శించారు. శాయంపేటలో బీఆర్ఎస్ నాయకుడు గణేశ్ తల్లి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ మండలాధ్యక్షుడు గుర్రం రవీందర్, రమేశ్, ఎస్కే గౌస్, దుంపల మహేందర్‌రెడ్డి, బేర్గు రాకేశ్, సాయి, అశోక్, గణేశ్, సారయ్య పాల్గొన్నారు.

'జలాశయాల సంరక్షణకు పాటుపడుదాం'

కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రకాశ్

హనుమకొండ, జూన్ 20 : జలాయాశయాల సంరక్షణకు పాటుపడుదామని, ఇందు కు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను ఏర్పాటు చేయడం మానుకుందామని పర్యావరణ పరిరక్షకుడు కే ప్రకాశ్ పిలుపునిచ్చారు. వినాయక చవితి, అమ్మవారి ఉత్సవాల సందర్భంగా విష రసాయనాలు కలిగిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను జలశయాల్లో వేయడం వల్ల నీరు కలుషితమై జలచరాలు అంతరించి పోయే అవకాశం ఉందన్నారు. అనంతరం ''పీవోపీ విగ్రహాలు వద్దు.. మట్టి విగ్రహాలు ముద్దు'' అనే నినాదంతో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, ప్రొఫెసర్ సురేశ్‌లాల్, పరికిపండ్ల వేణు, అనితారెడ్డి, మండల పరశురాములు, మెజీషియన్ కల్యాణ్ పాల్గొన్నారు.

'స్పోకెన్ ఇంగ్లిష్'కు పేర్లు నమోదు చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 20 : కేయూ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో 40 రోజుల స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతులు జూలై 10వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు సెల్ట్ బాధ్యుడు మేఘనారావు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఉద్యోగులు రూ.1000 చొప్పున ఇతరులు రూ.1500 ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజీ వారి నాన్ యూనివర్సిటీ ఫండ్ లో జూలై 9వ తేదీలోపు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఎంపీపీ మార్నేని మధుమతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఐనవోలు, జూన్ 20 : విద్యార్థులకు ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ మార్నేని మధుమతి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. పాఠశాల విద్యార్థులందరికీ బూట్ల ను అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పదిలో 9.3 జీపీ ఎస్ఎం ఎంఎస్ సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, హెచ్ఎం వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నల్లబెల్ల అనిత, మాజీ ఉపసర్పంచ్ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రుల పేర్లు చెప్పి బెదిరింపులు

- బీజేపీ మాజీ మండలాధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలి
- మాజీ సర్పంచ్ శరత్‌చంద్ర ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి

మాట్లాడుతున్న రావుల వెంకట్‌రెడ్డి

ధర్మసాగర్, జూన్ 20 : కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్లు చెప్పి ధర్మసాగర్‌కు చెందిన బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి పలువురిని బెదిరిస్తున్నాడని మాజీ ఉప సర్పంచ్ రావుల వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి శరత్‌చంద్ర ప్రసాద్, నాయకుడు పుట్ట నవీన్ ఆరోపించారు. గురువారం ధర్మసాగర్‌లో వారు మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన బొల్లం వీరస్వామికి చెందిన వ్యవసాయ భూమిని శ్రీనివాస్ రెడ్డి, అతడి తండ్రి దామోదర్ రెడ్డి కజ్జా చేసి దున్నుతుండగా వీరస్వామి అడ్డుకునే క్రమంలో దామోదర్ రెడ్డి కిందపడి గాయాల పాలయ్యాడు. కాగా, ఆ సమయంలో తాము అక్కడ లేమని, తమకు సంబంధం లేకపోయినా మడికొండ పోలీస్ స్టేషన్‌లో తమపై కేసు నమోదు చేయాలని భూమిని శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. శ్రీనివాస్‌రెడ్డి తనకు కేంద్ర మంత్రులు తెలుసు అని బెదిరిస్తూ చాలా మంది భూములను కజ్జా చేశాడని విమర్శించారు. గతంలోనూ శ్రీనివాస్ రెడ్డిపై పలు కేసులు నమోదయ్యాయని, జైలుకు కూడా పోయి వచ్చాడని తెలిపారు. బొల్లం వీరస్వామి భూమికి తమకు ఎలాంటి సంబంధం లేకున్నా తమపై ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. శ్రీనివాస్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేయడం మానుకోవాలన్నారు. ఇతరుల భూములు, ప్లాట్లను కజ్జా చేసిన వ్యక్తిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

చత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వినయ్‌భాస్కర్

ఐనవోలు, జూన్ 20 : ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మండలంలోని ముల్కలగూడెంలో ఆరెకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న, ఆరె సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. దేవేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. శివాజీ మహరాజ్ ఆశయాలు, ఆలోచనలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ శ్రీరాములు, ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేశ్, ఆరెకుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మోటె చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు హింగె శివాజీ, ఉపాధ్యక్షుడు కండే రావు, రాష్ట్ర నాయకులు దుమాల సుధాకర్, జిల్లా నాయకులు దీపక్, నిరంజన్, బాబురావు, కిషన్ రావు, సుబ్బారావు, చందర్‌రావు, రవి, రమేశ్, రాజేశ్వర్‌రావు, రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

హనుమకొండ, జూన్ 20 : పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా ముఖ్య మంత్రి సహాయ నిధి అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం హనుమకొండ కనుకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో వేలేరుకు చెందిన మహ్మద్ తయ్యబ్ చికిత్సకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైనరూ. 2.50లక్షలు, రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి గ్రామస్తుడు మడికంటి మధుకు మంజూరైన రూ. 80వేల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(ఐ) గ్రామానికి చెందిన నాగపూరి సాంబకుమార్ అనారోగ్యంతో బాధపడుతుండగా, అత్యవసర చికిత్స నిమిత్తం రూ. 2.50 లక్షల ఎల్‌వోసీ లెటర్ మంజూరు చేయించి కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ సర్పంచ్ అనిత పాల్గొన్నారు.

రెండెకరాల్లో పత్తి మొక్కల ధ్వంసం

ధ్వంసమైన పత్తి మొక్కలను చూపుతున్న రైతు

వేలేరు, జూన్ 20 : భూవివాదం కారణంగా రెండు ఎకరాల విస్తీర్ణంలో పత్తి మొక్కలను ధ్వంసం చేశారు. బాధితుల కథనం ప్రకారం.. వేలేరు మండలం పీచరకు చెందిన జల్తారి పరశురాములు తన రెండెకరాల వ్యవసాయ భూమిలో పత్తి సాగు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన కంకణాల కృష్ణమూర్తి, పరశురాములుకు మధ్య భూవివాదం ఉన్నది. ఈ కారణంతో పత్తి మొక్కలను కృష్ణమూర్తి బుధవారం ధ్వంసం చేసి పక్కనే ఉన్న బావిలో పడేశాడు. ఈ విషయంపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని పరశురాములు తెలిపాడు.

లైంగికదాడి కేసులో వ్యక్తికి 20ఏళ్ల జైలు

కమలాపూర్, జూన్ 20 : మండలంలోని గూనిపర్తి గ్రామానికి చెందిన ముత్యాల హన్మంతుకు లైంగికదాడి కేసులో న్యాయమూర్తి ఇరవై ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధించినట్లు సీఐ హరికృష్ణ గురువారం తెలిపారు. 2017లో బాలికపై హన్మంతు లైంగిక దాడి చేయడంతో కేసు నమోదైంది. హనుమకొండ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి అపర్ణాదేవి నిందితుడికి జైలు శిక్ష విధించారన్నారు. అలాగే బాధితురాలికి రూ.లక్ష పరిహారం మంజూరు చేసినట్లు చెప్పారు. సీఐ సతీశ్ చందర్‌రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి, కోర్టు కానిస్టేబుళ్లు హరీశ్, విక్రమ్ సాక్షాధారాలను సేకరించడంతో కీలకపాత్ర పోషించినట్లు సీఐ వెల్లడించారు.

కిట్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ షేక్ మునవర్‌కు డాక్టరేట్

షేక్ మునవర్

హసన్‌పర్తి, జూన్ 20 : ఎర్రగట్టు గుట్ట సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న షేక్ మునవర్‌కు చిదంబరంలోని అన్నామలై యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ అశోక్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీల్ లెర్నింగ్ మోడల్స్ యూజింగ్ కార్డియో వాస్క్యూలర్ డిజార్డర్ రిస్క్ ప్రిడక్షన్ అనే థిసీస్‌ను సమర్పించారని చెప్పారు. షేక్ మునవర్‌కు రిజిస్ట్రార్ కోమల్‌రెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి నిరంజన్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రభాకరాచారి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు

హనుమకొండ, జూన్ 20 : కలెక్టర్ ప్రావీణ్యను బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నయీముద్దీన్ రషత్, మహ్మద్ అబ్దుల్ షకీల్, తస్లీమ్ ఖానం, అబ్దుల్లాఖాన్ పాల్గొన్నారు.

రేపు డిగ్రీ ప్రిన్సిపాళ్ల సమావేశం

హనుమకొండ చౌరస్తా, జూన్ 20 : కేయూ పరిధిలోని డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లతో శనివారం 22న ఉదయం 10.30 గంటలకు విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సర అల్మానాక్, కాలేజీల అనుబంధాలు, పరీక్షా షెడ్యూళ్లు, స్పోర్ట్స్, గేమ్స్, జాతీయ సేవా పథకం, ఇతర అంశాలు చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

కాజీపేట, జూన్ 20 : కాజీపేటలోని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం చేపట్టనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు సంగమయ్య కోరారు. శరత్ మాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి దవాఖాన ఆధ్వర్యంలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. సెట్రరీ కేవీ రావు, కోశాధికారి ఐలయ్య పాల్గొన్నారు.

'ఆయిల్ పాం' సబ్సిడీ విడుదల

హనుమకొండ సబర్బన్, జూన్ 20 : ఆయిల్ పాం పంట ను సాగు చేస్తున్న రైతులకు రెండో సంవత్సరానికి గాను సబ్సి డీ డబ్బులను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో సా గు చేస్తున్న 303మంది రైతులకు 1,116 ఎకరాలకు సంబంధించి రూ.46,90,140 వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ డబ్బులను ఆయిల్ పాం పంట ఎదుగుదలకు వినియోగించుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసరావు సూచించారు. ఎవరికైనా డబ్బులు అందనట్లయితే డివిజన్ అధికారులను సంప్రదించాలన్నారు. కొత్తగా సాగు చేయాలనుకునే రైతులు తమను కలువాలన్నారు.

నిట్‌లో ముగిసిన ఇంటర్న్‌షిప్

హనుమకొండ చౌరస్తా, జూన్ 20 : నిట్‌లో బోయింగ్ స్పాన్సర్ చేసిన 'ఏఐ వోటీ ఇట్స్ అప్లికేషన్స్'పై వేసవి ఇంటర్న్‌షిప్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రీస